ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 14 అక్టోబరు 2025



సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయండి

కొడిమ్యాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగే తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిూస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మహా సభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ కోమటి చంద్రశేఖర్ కోరారు. సోమవారం మండలంలోని నాచుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెల 15న గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించే జిల్లా మహాసభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కనికరపు సత్తయ్య, గుడిసె దేవయ్య, మల్లయ్య, లక్ష్మీ, రేఖ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

● కలెక్టర్ సత్యప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబరు13 (ఆంధ్ర జ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10982 ఇళ్లు మంజురు కాగా 7343 మార్కౌట్ చేయగా 2984 బేస్‌మెంట్ స్థాయిలో, 721 గోడల స్థాయి, 369 స్లాబ్ స్థాయిలో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు మూడు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లా 22వ స్థానంలో ఉన్నదని పేర్కొన్నారు. మొదటి ఐదు స్థానాల్లో ఉండే విధంగా నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఇళ్ల నిర్మాణం సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందు పరచాలని దేశించారు. పనులలో సమస్యల గురించి అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు. ఇందిరమ్మ కమిటీలను సమన్వయం చేసుకుటూ పనులు తొందరగా పూర్తి చేయాలన్నారు. ప్రొసీడింగ్ ఇచ్చిన ఇళ్ల నిర్మాణ పనులు దీపావళి వరకు పూర్తి చేయకుంటే రెండు లేదా మూడు సార్లు నోటీస్‌లు ఇచ్చి వారి స్థానాల్లో అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులకు పట్టణంలోని ఇసుక బజార్‌లో ఇసుక లభిస్తుందని తెలపాలన్నారు. నిరుపేదలైన లబ్ధిదారులకు మెప్మా, సెర్ప్ ద్వారా మహిళా సంఘాలు రుణాలు ఇప్పించి నిర్మాణం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 16న జిల్లా ఉపాధి కల్పనా అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించబడునని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సత్తెమ్మ తెలిపారు. హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్ సంస్థలో(70), మారుతి సుజుకీ సంస్థలో(02), సెక్యూరిటీ గార్డు ఖాళీల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇట్టి ఉద్యోగాలకు ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, బీఎస్సీ(నర్సింగ్), ఏఎన్ఎం, జీఎన్ఎమ్ మరియు ఎంపీహెచ్‌డబ్ల్యూ అర్హత కలిగిన వారు అర్హులన్నారు.

ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, జగిత్యాలలో పనిచేయాల్సి ఉంటుందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సత్తెమ్మ తెలిపారు. అభ్యర్థులకు వేతనం నెలకు రూ.12వేల నుంచి రూ.39,500వరకు ఉంటుందన్నారు. అర్హత ఆసక్తి గలిగిన నిరుద్యోగ యువత ఈనెల 16న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కలెక్టరేట్ కార్యాలయంలోని రూం నెంబర్ 218లో జరిగే జాబ్‌మేళాలో సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఈ సదవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉపాధిహామీ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు(ఫైల్)



'ఉపాధి'లో అక్రమాలకు చెక్

● ఈజీఎస్ కూలీలకు ఈకేవైసీ

● ఆధార్, జాబ్‌కార్డు వివరాలు యాప్‌లో నమోదు

● జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ

జగిత్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉపాధి కూలీల ఈకేవైసీ నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోంది. కూలీల ఆధార్‌కార్డులను జాబ్‌కార్డులతో ఈకేవైసీ చేసుకుంటేనే అక్టోబరు నుంచి ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం ఎన్ఆర్ ఈజీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధి కూలీల ఆధార్, ఉపాధికార్డు వివరాలను నమోదు చేసి ముఖ గుర్తింపు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కూలీలు తమ ఆధార్, జాబ్ కార్డులతో ఉపాధిహామీ సిబ్బందిని కలిస్తే ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తారు. ఇందుకోసం కూలీలు, ఆధార్ కార్డును తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలి. ఈకేవైసీ పూర్తి చేయని కూలీలు ఇక నుంచి ఉపాధి పనుల్లో అవకాశం కోల్పోతారు.

● జిల్లాలో 1.39 లక్షల మంది కూలీలు

జిల్లాలో ఉపాధిహామీ కూలీలు మొత్తం 1,39,285 మంది ఉన్నారు. కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ నిధులను స్వాహా చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పనులకు వెళ్లకున్నా వెళ్లినట్లు, ఒకరి పేరు మీద మరొకరు వెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు సామాజిక తనిఖీల్లో అక్రమాలు బయట పడడం, రికవరీలు జరుగుతున్నా ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. ఈ క్రమంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిని సైతం దుర్వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో కూలీలకు కూలి గిట్టుబాటు కాక ఆశించిన స్థాయిలో వేతనాలు సైతం రావడం లేదు. గతంలో జాబ్‌కార్డు ఆధార్ కార్డుకు అనుసంధానం చేసినా ం. వీలైనంత త్వరగా ఈకేవైసీని పూర్తి చేస్తాం. కొన్ని చోట్ల హాజరు నమోదులో తప్పిదాలు చేస్తున్నట్లుగా విమర్శలున్నాయి. దీంతో వీటన్నింటికీ చెక్ పెట్టేలా కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీని తప్పనిసరి చేసింది.

● హాజరు నమోదు ఇలా..

యాక్టివ్ కూలీల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసి పనికి రాగానే, పూర్తయ్యాక రెండు సార్లు ముఖ గుర్తింపు ఫొటో తీసి..

-మిగతా 8లో

జిల్లాలోని మండలాలు	20
గ్రామ పంచాయతీలు	380
మొత్తం కూలీల సంఖ్య	1,39,285
ఈకేవైసీ పూర్తి చేసిన కూలీల సంఖ్య	1,04,042
ఇంకా చేయాల్సినవి	35,216

బస్సు సౌకర్యం కల్పించాలి

జగిత్యాలరూరల్, అక్టోబరు13 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లోని గుల్లపేట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్ సత్యప్రసాద్‌కు మాజీ సర్పంచ్ జక్కుల తిరుపతి సోమవారం వినతిపత్రాన్ని అందించారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో జగిత్యాల నుంచి గుల్లపేట మీదుగా అర్పపల్లి వరకు బస్సు నడిపే వారిని ప్రస్తుతం బస్సు నడపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. బస్సు సౌకర్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

ఎంఐఎం పట్టణ కమిటీ రద్దు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ ఎంఐఎం పార్టీ కమిటీను రద్దు చేసినట్లు ఆ పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసన పార్టీ సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జీ యాసర్ అరాఫత్ ఆదేశాల మేరకు జగిత్యాల పట్టణ ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను తెలుసుకొని పార్టీ అధిష్టానానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు జగిత్యాల కమిటీని రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు మాజీ కౌన్సిలర్ రజియుద్దీన్, యూత్ నాయకుడు సుమేర్, కోరుట్ల అధ్యక్షులు అబ్బుల్ రఫీ, మెట్‌పెల్లి అధ్యక్షులు మహ్మద్ నిఖిల్ పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య తీర్చాలి

మల్లాపూర్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం కొత్తధాం రాజుపల్లి గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని మండల బీజేపీ నాయకుడు ఇల్లెందుల కాంతయ్యచారి డిమాండ్ చేశారు. మిషన్ భగీరథతో పాటు గ్రామంలో వచ్చే మంచి నీరు రావడం లేదని ఆయన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు సమస్యపై దృష్టి సారించి వెంటనే నీటి వసతి కల్పించాలన్నారు.

అందరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలి


సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న వైద్యాధికారులు

జగిత్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్డియో పల్మనరి రిసాసిటేషన్ సీపీఆర్‌పై మరింత అవగాహన అవసరమని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. అక్టోబర్ 13వ తేదీ నుంచి అక్టోబర్ 17 తేదీ వరకు సీపీఆర్ వారోత్సవాలు జరుగుతున్న సందర్భంగా స్థానిక సమీకృత జిల్లా కార్యాలయంలోని మీటింగ్ హాల్లో సోమవారం కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ వల్ల చాలా మంది యుక్త వయసులోనే మరణిస్తున్నారన్నారు. అందరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉన్నట్లైతే కార్డియాక్ అరెస్టు వచ్చిన వారిలో పది శాతం ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వారం రోజులు జిల్లాలో అన్ని చోట్లా సీపీఆర్‌పై విస్తృతమైన అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. డాక్టర్ లవ కుమార్, డాక్టర్ నరేశ్ మన్న క్వీన్స్‌తో డెమో చేసి చూపించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అందరి చేత ప్రతి ఒక్కరూ తన ఆరోగ్యం పట్ల మరియు తోటి వారి ఆరోగ్యం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జిల్లా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాజాగౌడ్, ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, జీవాకర్‌రెడ్డి, ట్రైనీ అదనపు కలెక్టర్ కే.హరిణి, జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ నరేశ్, డీఆర్‌డీవో రఘువరన్ పాల్గొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 మంది బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డేలో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జగిత్యాల అర్బన్, అక్టోబరు13 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఇస్లాంపురకు చెందిన సయ్యద్ ఫజలుప్లాకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన 21,500 రూపాయల చెక్కును జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అందించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్‌లు తపోట మల్లి కార్జున్, నాయకులు చెట్‌పెల్లి సుధాకర్, కూతురు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

భీమారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన వసం గంగు కుక్కల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి సోమవారం పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు ఉరుమట్ల లక్ష్మణ్, బక్కూరి నరేష్, ఎనుగంటి హరీష్, బూరం అరుణ్ తదితరులు ఉన్నారు.

'బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి'


రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

కొడిమ్యాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొడిమ్యాల మండలంలోని పూడూర్ రోడ్డుపై మండలంలోని పలు గ్రామాల బీసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని రాస్తారోకో చేసారు. దాదాపు అరగంటసేపు రాస్తారోకో జరగ్గా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు బింగి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్‌తో బీసీలకు సామాజిక. రాజకీయ న్యాయం జరుగుతదన్నారు. జీవో 9ను అమలు చేయాలని కోరారు. జీవో 9 అమలు చేసినట్లయితే బీసీలకు రాజకీయ ఎదుగుదల సాధ్యమవుతుందనన్నారు. సమాచారం అందుకున్న కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బీసీ సంఘాల నాయకులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపచేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పులి వెంకటేష్‌గౌడ్, వొల్లాల లింగాగౌడ్, ఏగుర్ల తిరుపతి, కదారి మల్లేశం, బీరయ్య, బోగ రాకేష్, కూనవేని రాజశేఖర్, బైరి కార్తిక్, రాచకొండ చంద్రమోహన్, మచ్చ రాజు, బ్రహ్మయ్య, సంతోష్, మల్లయ్య, కళ్యాణ్‌తో పాటుగా మండలంలోని పలు గ్రామాల బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు అంబేద్కర్ సంఘాల రాష్ట్ర నాయకుడు కొత్తూరి స్వామి, దళిత సంఘాల నాయకులు దుబ్బాక చందు, శ్రావణ్, సంఘీబావం తెలిపారు.

మధ్యాహ్న భోజనశాలలు పూర్తయ్యేదెన్నడో..?
● నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
6

ప్రజావాణి సమస్యలను సత్వరం పరిష్కరించాలి
● కలెక్టర్ సత్యప్రసాద్
8

'సన్న రకం ధాన్యానికి బోనస్ డబ్బులు ఇప్పించండి'


కలెక్టర్ కార్యాలయంలో తమ ఆవేదనను తెలుపుతున్న రైతులు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): యాసంగికి సంబంధించిన సన్నరకం ధాన్యం బోనస్ డబ్బులు ఇప్పించాలని రైతు ఐక్యవేదిక నాయకులు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో విక్రయించిన సన్నవడ్లకు ఇప్పటి వరకు బోనస్ అందలేదని వెంటనే ఇప్పించాలని కోరారు. సన్నరకం సాగువైపు మొగ్గుచూపితే, ధాన్యం కొనుగోలు చేసి ఇన్ని నెలలు గడుస్తున్నా బోనస్ రాకపోవడం రైతులకు ఆవేదన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, బందెల మల్లయ్య, బుచ్చిరెడ్డి, కొట్టాల మోహన్‌రెడ్డి, పడిగెల రాజన్న, కాటిపెల్లి సురేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీను తదితరులున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

వెల్గటూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో కృపాకర్ సూచించారు. సోమవారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వలన పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుం దని అన్నారు. తల్లులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పౌష్టికాహారం అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాళు, పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్రీ, ఆర్ఐ రాజేశ్వరి, ఏపీఎం తులసీమాత, ఏఎన్ఎం జయప్రద, మల్లీశ్వరి, తల్లులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

●కొడిమ్యాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గర్భిణిలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీవో స్వరూప అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ మల్యాల ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ తల్లులు, గర్భవతులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించు బాలామృతం, ఆహార పదార్థాలను భుజించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం సీడీపీవో వీరలక్ష్మీ మాట్లాడుతూ గర్భస్థ శిశువు ఎదుగుదలకు ప్రొటీన్లతో కూడిన ఆహారాన్ని గర్భిణులు తీసుకోవాలన్నారు. ప్రొటీన్లతో కూడిన ఆహారాన్ని తీసుకోవటంతో శిశువు ఎదుగుదలతో పాటుగా తల్లి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గుడ్లు, ఆకు కూరల ఆహారం ఆరోగ్యంగా ఉంచుతుందన్నారు. అనంతరం అనంతరం అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించి అభినందించారు. గర్భిణులకు అధికారులు సీమంతం చేసారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఏపీఎం మల్లేశం, సూపర్‌వైజర్లు సుదారాణి, ఉమ, అంగన్‌వాడీ టీచర్లు, గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు.

●కథలాపూర్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను జంక్ ఫుడ్ నుంచి దూరంగా ఉంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి సూచించారు. మండలంలోని తాండ్ర్యాలలో పోషణ మాసంలో భాగంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. వంటలలో చక్కెర, ఉప్పు, నూనెల వాడకాన్ని తగ్గించాలన్నారు. అప్పుడే వండిన వేడి పదార్థాలు తినాలని పేర్కొన్నారు. పోషకాలు అధికంగా ఉన్న ఆకు కూరలు, గుడ్లు, తాజా కూరగాయలు, చిరుధాన్యాలు చిన్నారులకు తినిపించాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మీ, రమ, వనిత, స్వరూప, ఆశా కార్యకర్తలు లత, రాజ్యలక్ష్మీ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఇద్దరు కూలీల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి

చిగురుమామిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముల్కనూర్‌లో గల శాతవాహన బ్రీడింగ్ హేచరీస్ ప్రైవేట్ కంపెనీలో సోమవారం ఇద్దరు కూలీలు ఘర్షణ పడగా.. అందులో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై కె స్వాతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కంపెనీలో పనుల చేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన దాసోసోరెన్, ఖాన్ అన్వేవ్యక్తులు ఘర్షణ పడ్డారు. అందులో ఖాన్ అనేవ్యక్తి దాసో సోరెన్‌ను మొదటి అంతస్తు నుంచి కిందికి తోసి వేశాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమ్మిత్తం అతన్ని కరీంనగర్‌కు 108లో తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ మృతిచెందినట్లు తెలిపారు. సూపర్‌వైజర్ ఎస్‌కె అర్షిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని తిమ్మాపూర్ సీఐ గడ్డం సదన్‌కుమార్ పరిశీలించారు.

ఉరి వేసుకొని ఒకరి బలవన్మరణం

చిగురుమామిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి శ్రీనివాస్(45) జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కె స్వాతి తెలిపారు. ఆమె తెలిపన వివరాలిలా ఉన్నాయి.. శ్రీనివాస్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతనితో గొడవపడి ఎనిమిది నెలల క్రితం భార్య గీత తన తల్లి గారి ఇంటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెందిన శ్రీనివాస్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడు శ్రీనివాస్ కొడుకు అరవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానేరువాగులో పడి ఒకరి మృతి

ఇల్లంతకుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన బండారి వెంకటయ్య(48) అనే కూలీ స్నానానికి వెళ్లి మానేరువాగులో పడి మృతిచెందినట్లు అదనపు ఎస్సై లక్పతి తెలిపారు. వెంకటయ్య గ్రామంలో హమాలీ పనిచేస్తూ జీవిస్తుంటాడు. కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం సాయంత్రం పనిచేసి గ్రామసమీపంలోని మానేరువాగులోకి స్నానానికి వెళ్లాడు. బట్టలు ఉతికి సైకిల్‌పై ఆరవేశాడు. రాత్రి ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు గాలించారు. సోమవారం ఉదయం గ్రామస్థులు వాకింగ్‌కు మానేరు వంతెనపైకి వెళ్లగా నీటిలో మృతదేహం కనిపించింది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి నదిలో పడి యువకుడి మృతి

మంథనిరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాన్‌సాయి పేటవద్ద గోదావరి నదిలో మునిగి సోమవారం యువకుడు మృతిచెందాడు. కిషన్ అనే రైతుకు గోదావరి ఒడ్డున పొలం ఉంది. గోదావరి వరదల కారణంగా పంటలసాగుకోసం నదిలో మోటారు అమర్చుకోగా దానిని తీయడానికి రాజు, గామిడి సూర్య వెళ్లారు. మోటారు తీస్తున్న క్రమంలో సూరి(21) అనేయువకుడు నదిలో గల్లంతయ్యాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్థులు గాలించారు. చివరికి మృతదేహాన్ని గుర్తించారు. మంథని ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ సిబ్బంది ఫైర్‌ఆఫీసర్ శివశంకర వరప్రసాద్, ఫైర్ మెన్ శ్రావణ్‌కుమార్, ఆపరేటర్లు చందర్, నాగరాజు ఎల్‌మడుగు వద్దకు చేరుకొని రెస్క్యూ చేసి సూరి మృతదేహాన్ని నది నుంచి వెలికితీశారు.


సూరి(ఫైల్)

వివాహిత ఆత్మహత్య

మల్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అత్త, మామ, ఆడబిడ్డలతో పాటు మరోవ్యక్తి వేధింపులకు గురిచేయడంతో గుర్రం సుమలత(28) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపినవివరాల ప్రకారం మెట్‌పల్లిమండలం వెల్లుల్ల గ్రామానికిచెందిన గుర్రం సుమలతకు మల్యాల మండలం రాజారం గ్రామానికిచెందిన గుర్రం నర్సయ్యతో 13సంవత్సరాల క్రితం వివాహంజరిగింది. నర్సయ్య నాలుగునెలల క్రితం ఉపాధికోసం దుబాయి వెళ్లగా సుమలత తనపిల్లలతోకలిసి అత్తగారింట్లో ఉంటోంది. సుమలత సోమవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసు కుంది. మృతురాలితండ్రి బోదాసుగంగాధర్ ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటో బోల్తా... ఒకరికి తీవ్ర గాయాలు

ఫైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాలనీ చౌరస్తాలో సోమవారం రాత్రి ఆటోబోల్తా పడిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం ప్రకారం.. ఆటో డ్రైవర్ గణేష్ ఆటోలో ప్రయాణికుడిని ఎక్కించుకుని చౌరస్తా దాటుతున్న సమయంలో సైకిల్ అడ్డువచ్చింది. గణేష్ సైకిల్‌ను తప్పించే క్రమం లో ఆటో సైకిల్‌ను, పక్కనే ఉన్న టీస్టాల్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆటోడ్రైవర్ గణేష్‌కు స్వల్ప గాయాలు కాగా ఆటోలో ఉన్న ప్రయాణికుడు స్వామి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన గణేష్‌ను 108లో స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మధ్యాహ్న భోజనశాలలు

పూర్తయ్యేదెన్నడో..?

● నిధుల కొరతతో ముందుకు సాగని పనులు ● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కథలాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన శాలల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనశాలలు నిర్మించాలని నిర్ణయించింది. ఒక్కో భవనానికి రూ.14.5 లక్షల ఉపాధిహామీ నిధులు కేటాయించారు. కథలాపూర్ మండలంలోని సిరికొండ, గంబీర్‌పూర్, కథలాపూర్, బొమ్మెన గ్రామాలకు నిధులు మంజూరు చేయగా స్థానిక పాఠశాల కమిటీ చైర్మన్లు భవన నిర్మాణ పనులుకు శ్రీకారం చుట్టారు. కానీ సిరికొండ, గంబీర్‌పూర్, కథలాపూర్ గ్రామాల్లో భవన నిర్మాణ పనులు పిల్లర్ల దశకు చేరుకోగా బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. ఒక్కో కాంట్రాక్టర్ సుమారు రూ.6 లక్షల మేర పనులు చేయగా అదే సమయంలో ప్రభుత్వం మారడంతో బిల్లులు విడుదల కాలేదు.


సిరికొండలో పిల్లర్లకే పరిమితమైన భోజనశాల నిర్మాణం

నిర్మాణం కోసం తెచ్చుకున్న స్టీల్, సిమెంట్ వానలకు తడిచి పోయి మరింత నష్టం వాటిల్లిందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనశాలలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


గంభీర్‌పూర్‌లో పిల్లర్లకే పరిమితమైన నిర్మాణం

నిధులు విడుదల చేయాలి
దొప్పల జలందర్,
ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్, సిరికొండ



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనశాలల నిర్మాణానికి నిధులు విడుదల కాక పనులను అర్ధాంతరంగా నిలిపివేయాల్సి వచ్చింది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

జమ్మికుంటలో జోరుగా గుట్కా దందా..

జమ్మికుంట రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో గుట్కావ్యాపారం జోరుగా సాగుతోంది. అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ.. ఈ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. మండలవ్యాప్తంగా కొంతమంది దళారులు డీలర్ల అవతారం ఎత్తి గుట్కాను పక్కరాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది. రాత్రి, తెల్లవారుజామున ప్రత్యేక వాహనాల్లో గుట్కా, అంబార్ ప్యాకెట్లు వస్తున్నాయి. చాలామంది గుట్కా, అంబార్, పాన్‌మసాలకు అలువాటు పడటంతో ఈ దందా జోరుగా సాగుతోంది. ప్రధానంగా యువత వీటి బారిన పడుతూ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు.

● తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం..

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండటంతో పలువురు ఈ వ్యాపారంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తున్నది. దుకాణదారుల అవసరాలను బట్టి డీలర్లు సరఫరా చేస్తుంటారు. రూ.10 విక్రయించాల్సిన అంబర్ ప్యాకెట్‌ను రూ.30వరకు విక్రయిస్తున్నారు. కొంతమంది వారి దుకాణాల వరకు చాటుమాటున విక్రయిస్తుంటే, మరి కొంతమంది పెద్దఎత్తున దిగుమతి చేసుకొని చిన్నచిన్న దుకాణాలకు సరఫరా చేస్తూ లక్షల్లో లాభాలు ఆర్జిస్తున్నా రు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిషేదిత గుట్కా, అంబార్ ప్యాకెట్ల విక్రయదారులపై చర్యలు తీసు కుంటారో లేదో చూడాలి.

అప్పుల భారంతో వ్యాపారి ఆత్మహత్య

● వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నట్లు సూసైడ్ నోట్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్ 1వ బైపాస్ రోడ్డు సమీపంలో గల శ్రీలక్ష్మి గణేష్ కళా ఆర్ట్స్ కేంద్రంలో విక్రుతి శేఖర్(50) అనేవ్యాపారి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు రాసిన నాలుగుపేజీల సూసైడ్ లేఖ లభ్యమైంది. సిరిసిల్ల పట్టణంలోని అనంత నగర్‌కు చెందిన శేఖర్ కొంతకాలంగా 1వ బైపాస్ రోడ్డులో శ్రీలక్ష్మి గణేష్ కళాఆర్ట్స్ పేరిట వినాయక విగ్రహాలు తయారుచేసి విక్రయిస్తున్నాడు. సూసైడ్‌కు ముందు తను రాసిన లేఖలో జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పేర్కొన్న వివరాల ప్రకారం.. శేఖర్‌కు వినాయక విగ్రహాల తయారీ, విక్రయ వ్యాపారంలో రూ. 1.80కోట్ల నష్టం వాటిల్లింది. 15మంది వడ్డీ వ్యాపారుల వద్ద దాదాపు రూ.1.32కోట్ల అప్పు చేశాడు. అయితే వడ్డీవ్యాపారులకు ఇప్పటికే రూ.1.29కోట్లు చెల్లించాడు. అప్పు ఇచ్చిన వారిలో బాలసాని అంజయ్య అనేవ్యక్తి శేఖర్‌ను, అతని భార్యను, పిల్లలను బెదిరింపులకు గురిచేశాడు. దీంతో తీవ్ర ఒత్తిడితోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నానని పేర్కొన్నాడు. అంజయ్య శాంతినగర్‌లో ఉన్న తన ఫ్లాట్ లాక్కోవాలని చూస్తున్నాడని. ఇప్పటికే అతనికి రూ.38లక్షల అప్పునకు రూ.45 లక్షలు చెల్లించానని పేర్కొన్నాడు. అయినప్పటికీ అనేక ఇబ్బందులు పెట్టాడని, వేధింపులు భరించలేక పోయానని పేర్కొన్నాడు. మరో వడ్డీ వ్యాపారీ బాలసాని ముత్తయ్య తన ఇల్లు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నాడు. గ్రూప్ నంబర్5లో మెంబర్‌షిప్ ఉందని చిన్న కొడుకుకు ఇవ్వాలని ఎక్సైజ్ సూపరింటెంట్‌ను కోరాడు. షెడ్ కిరాయి ఇంకా ఉంది. రూ.16లక్షలు కొందరికి చెల్లించమని తన బావమరిది సాంబయ్యకు రాశాడు. నేను చాలామందికి అప్పు ఉన్నాను. ఆస్తిఅంతా నా పిల్లలకు ఇవ్వాలని.. ఇదే నా మరణ వాంగ్మూలమని.. నన్ను క్షమించండంటూ రాశాడు. మృతుడికి భార్య వసుంధర, కుమారులు అఖిల్, మణిదీప్ ఉన్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ కృష్ణ పరిశీలించారు. సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వడ్డీ వ్యాపారి చంపుతానని బెదిరించడం వల్లనే శేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.


శేఖర్(ఫైల్)

రోడ్డుపైకి ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మానకొండూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై మానకొండూర్ శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్లకొమ్మలు వ్యాపించి ప్రయాణికులకు రోడ్డు కనిపించడం లేదు. గ్రామ శివారులోనే ఓ వ్యవసాయబావి ఉంది. ఆ బావి చుట్టూ వివిధ రకాల చెట్లు ఉన్నాయి. ఆ చెట్లు బావి కనిపించకుండా చేయడమే కాకుండా రోడ్డు మధ్య వరకు కొమ్మలు వచ్చి రాకపోకలకు ఇబ్బందులు కల్గిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ చెట్లను తొలగించలేదు. కనీసం ప్రమాద సూచిక ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు రోడ్డుపై ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదసూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


మానకొండూర్‌లో సగం రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలు

చోరీపై పోలీసుల విచారణ

పాలకుర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని గుడిపెల్లి గ్రామ పంచాయతీకిచెందిన చెత్తసేకరణ వాహనానికి సంబంధించిన బ్యాటరీ, టైరుచోరీపై సోమవారం పోలీసులు విచారణ చేపట్టారు. ఈనెల10న గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిలిపి ఉన్న ట్రాలీఆటో బ్యాటరీ, టైరు చోరీకి గురైందని పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చిగురుమామిడి ఎంపీడీవో సస్పెన్షన్

చిగురుమామిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాస మధుసుదన్‌ను క్రమశిక్షణ చర్యలో భాగంగా సస్పెన్షన్ చేసినట్లు, జిల్లా కలెక్టరు నుంచి ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది. ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో మండలంలో రేకొండ గ్రామంలోని 14వ వార్డులో, చిగురుమామిడి 3వవార్డులో రిజర్వేషన్ విషయంలో ఆన్‌లైన్‌లో తప్పు చేసినట్లు బయటపడడంతో జిల్లా కలెక్టరు ఆయనను సస్పెన్షన్ చేసినట్లు తెలిసింది. ఆయన స్థానంలో ఎంపీడీవోగా ప్రస్తుతం ఇంకా ఎవ్వరికీ బాధ్యతలుఇవ్వలేదని సమాచారం.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మంథని, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌పూర్ శివారులోని మానేరునది నుంచి ఇసుక అక్రమరవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐరమేష్ సోమవారం తెలిపారు. వేల్పులఅశోక్, అక్కపాక శశికుమార్, రాచర్ల నాగరాజు, పర్ష ఓదెలు, పొన్నాల సురేష్, కటకం సదయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లనుస్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమరవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కరీంనగర్ క్రైం: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడుట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చేగుర్తి, శ్రీనివాసనగర్, దుర్శేడ్ గ్రామాలకు చెందిన ట్రాక్టర్‌డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

నాటుసారా పట్టివేత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శంకర్ నాయక్‌తండాల్లో ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో నిల్వచేసిన 8లీటర్ల సారా, 100లీటర్లపానకం, ముడిపదార్థాలను స్వాధీనపర్చుకున్నారు. తయారీదారులు కేలోతు రమేశ్, కేలోతు శంకర్, భూక్య భూలీలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. సారాతయారీ, అమ్మితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.


స్వాధీనపర్చుకున్న సారా, ముడి పదార్థాలతో ఎస్‌ఐ లక్ష్మణ్

ధరూర్‌లో నాలుగు ఇళ్లలో చోరీ

● 8 తులాల బంగారం, ద్విచక్రవాహనం ఎత్తుకెళ్లిన దొంగలు

జగిత్యాలరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి తాళాలు వేసి ఉన్న నాలుగు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడి 8తులాల బంగారం, 45తులాల వెండితో పాటు రూ.2.20లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ధరూర్ గ్రామంలో ఆదివారం రాత్రి ఓ పెళ్లి భారత్ కొనసాగుతుండగా ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దొంగలు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేశారు. ధరూర్ గ్రామానికి చెందిన మంథని కవిత, షేక్ షబానా, ద్యాగల నరేష్, శ్రీనివాస్ ఇళ్ల తాళాలు పగులకొట్టి అందినకాడికి దోచుకెళ్లారు. బాధితులు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్ ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.


బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ సుధాకర్

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన మరో కారు

తిమ్మాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుభాష్‌నగర్ స్టేజివద్ద సోమవారం రాత్రి రాజీవ్‌రహదారి పక్కన ఆగిఉన్న కారును వెనుకల నుంచి వచ్చిన మరోకారు ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ స్టేజి వద్ద ఆగిఉన్న ఓ కారును వెనుకల నుంచి మరోకారు అతివేగంగా వచ్చిఢీకొంది. ఈప్రమాదంలో ఆగిఉన్న కారులోని భార్య, భర్తలతో పాటు బాలుడికి గాయాలైనట్లు సమాచారం. గమనించిన స్థానికులు వెంటనే వేరేకారులో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.


ఆగిఉన్న కారును ఢీకొన్న మరో కారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుట్లపేట గ్రామశివారులో సోమవారం రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన శ్రీనివాస్, నర్సయ్య గాయపడ్డారు. క్షతగాత్రులను మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాచర్లగొల్లపల్లి నుంచి నాగంపేటకు చెందిన శ్రీనివాస్, నర్సయ్య బైక్‌పై స్వగ్రామానికి వెళుతున్నక్రమంలో ఓకారు ఢీకొట్టింది.

ద్విచక్రవాహనంపై ఉన్న శ్రీనివాస్, నర్సయ్య గాయాలపాలయ్యారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఉమ్మడికరీంనగర్ జిల్లాలో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

కోరుట్ల రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం వేంకటాపూర్ గ్రామశివారులో జరిగిన రోడ్డుప్రమా దంలో కోరుట్ల పట్టణానికిచెందిన వినోద్(29) అనే యువకుడు మృతిచెందినట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు.కోరుట్ల పట్టణంలోని ఐబీ రోడ్డుకు చెందిన వినోద్ ఎలక్ట్రీషియన్. సోమవారం కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు వెళ్లి కోరుట్లకు తిరిగివస్తున్న సమయంలో వెంటకటాపూర్ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనిసంఘటన స్థలంలోనే వినోద్ మృతిచెందాడు. వినోద్‌కు భార్య చందనతోపాటు ఎనిమిది నెలల కుమారుడు ఉన్నాడు.


వినోద్(ఫైల్)

ఆర్నకొండలో..

చొప్పదండి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు మరణించాడని ఎస్ నరేష్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. సుల్తానాబాద్ మండలం పూసాలకుచెందిన మెరుగు సాయికిరణ్(20) తన మిత్రుడు జడల మహేశ్‌తో కలిసి బైక్‌పై ఆర్నకొండకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో రాయపట్నం రహదారిపై కరీంనగర్ నుంచి లక్షెట్టిపేట వెళుతున్న పాలవ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికిరణ్ అక్కడికక్కడే మరణించగా బైక్‌పైవెనకాల కూర్చున్న మహేశ్‌కు గాయాలయ్యాయి. మృతుడు సాయికిరణ్ తండ్రి మెరుగు శంకరయ్య ఫిర్యాదు మేరకు డీసీఎంవ్యాన్ డ్రైవర్ ముదేళ్లరాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డి పేట గ్రామానికి చెందిన చింత సమ్మయ్య(46) వృత్తిరిత్యా గీత కార్మికుడు. సోమవారం రాత్రి సమ్మయ్య తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సమ్మయ్య తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. సమ్మయ్య వాహనాన్ని ఢీకొట్టిన వాహనదారుడు మెట్‌పల్లి క్వారీనుంచి వస్తున్న నీరాల రాకేష్‌గా గుర్తించారు. ఈ ఘటనలో రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.


సమ్మయ్య(ఫైల్)


సంచిని అప్పగిస్తున్న ఎస్సై

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రంగంపల్లికి చెందిన పర్లేళ్ల లక్ష్మి సోమవారం రంగంపల్లి నుంచి జెండా చౌరస్తాకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అయితే జెండా చౌరస్తా రాగానే వెంటతెచ్చుకున్న సంచిని ఆటోలోనే వదిలేసి దిగిపోయింది. ఆటోడ్రైవర్ కుంభాల ప్రభుదేవా గుర్తించి సంచిని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైకి అప్పగించాడు. పోలీసులు ఆమె ఆచూకీ గుర్తించి అందజేశారు. అందులో 17వేల రూపాయలు ఉన్నాయని, నిజాయితీని చాటుకున్న ఆటోడ్రైవర్‌ప్రభుదేవాను ఎస్సైలక్ష్మణ్‌రావు అభినందించారు.

నిరుపయోగంగా వారసంత సముదాయం

● గ్రామీణుల సౌకర్యార్థం నిర్మాణం
● ప్రారంభించినా వినియోగంలోకి రాని వైనం

కరీంనగర్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణుల సౌకర్యార్థం లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంత సముదాయం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వంలో వారసంత సముదాయాల నిర్మాణాలు చేపట్టారు. ఇందుకోసం ఉపాధి హామీనిధులతో పాటు గ్రామ పంచాయతీ నిధులను మంజూరు చేశారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో గ్రామ సంత సముదాయం నిర్మించారు. ఇందుకోసం ఉపాధిహామీ నిధులు రూ.9లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ.3.25లక్షలు వెచ్చించారు. ఆరుగ్రామాలకు అందుబాటులో ఈ సంత ఉపయోగపడుతుందని భావించారు. కరీంనగర్ మండలంలోని మందులపల్లి, చెర్లబూత్కూర్, అటు సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, సాంబయ్యపల్లి, నారాయణరావుపల్లి, దుబ్బపల్లి గ్రామాలకు సమీపంలో సముదాయం నిర్మించగా అప్పటి మంత్రి, ప్రస్తుతఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆగస్టు 2022లో ప్రారంభించారు. ఇప్పటికీ గ్రామస్తులకు అందుబాటులోకి తేలేక పోయారు. మరోవైపు ఉపయోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారింది. అన్ని హంగులతో నిర్మించిన గ్రామసంత మార్కెట్ ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మూడు సంవత్సరాల క్రితం ప్రారంభించిన శిలాఫలకం


మొగ్దుంపూర్‌లో వృథాగా మారిన వారసంత సముదాయం

సూక్ష్మ చిత్రకళాకారుడికి క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్



సర్టిఫికెట్లతో కళాకారుడు రజనీకాంత్

ఓదెల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడకకు చెందిన సూక్ష్మ చిత్రకళ ఉపాధ్యాయుడు, ఆడెపు రజనీకాంత్‌కు క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెన్సిల్ గ్రాఫైట్ పై 0.4 మిల్లీమీటర్ల ఎత్తు 0.2 మిల్లీమీటర్ల వెడల్పు ఉన్న ప్రపంచంలోని అతి చిన్న జాతీయ పతాకాన్ని సుమారు గంటపాటు శ్రమించి తయారు చేసినందుకుగాను, ముంబైలోని ప్రధాన కార్యాలయం క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు వికాస్ బొండవే, పునీత్ మాదన్‌లు రజనీకాంత్‌కు ఈమెయిల్ ద్వారా సమాచారం అందించారు. సూక్ష్మకళ నైపుణ్యంలో తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డులతో పాటు అంతర్జాతీయ, జాతీయ అవార్డులను రజనీకాంత్ అందుకున్నారు.

తుంగూర్‌లో కొండచిలువ

పట్టుకొని అడవిలో వదిలేసిన యువకులు

బీర్‌పూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలోని ఓ ఇంట్లోకి ఆదివారం రాత్రి కొండచిలువ ప్రవేశించింది. గ్రామంలోని కొల్వాయికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న ఇంటిలోకి కొండచిలువ ప్రవేశించడంతో కాలనీ వాసులు ఆందోళన చెందారు. అక్కడే ఉన్న కొందరు యువకులు వచ్చి కొండచిలువను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలి వేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీరాంసాగర్ నుంచి 25 వేల క్యూసెక్కుల నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరికి సోమవారం 25 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు 5,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

తాటిచెట్టుపై పిడుగు

రాయికల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రామాజీపేట రోడ్డులోని కల్లు మండపం సమీపంలో ఉన్న తాటి చెట్టుపై పిడుగు పడటంతో మంటలు వ్యాపించాయి. వర్షానికి రోడ్లన్నీ జలమయం కావడంతో వ్యాపారులు, ఉద్యోగుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అందమైన అక్షరం

చేతి రాత మార్చేందుకు ప్రత్యేక శిక్షణ

దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించిన అక్షర్ సంస్థ

ఆసక్తి చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అక్షర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మేరాజ్‌అహ్మద్

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ చేతిరాత బాగా లేదని బాధపడాల్సిన అవసరం లేదు... మారాలన్న...మార్చుకోవాలన్న సంకల్పం ఉంటే చాలు సాధన చేయించేందుకు తాను ఉన్నానంటూ 'అక్షర్'. చేతి రాత మార్పుతో ఆలోచనలో కూడా మార్పు వస్తుంది... సమాజంలో ఉన్నత వ్యక్తిగా గుర్తింపునిస్తుంది. అన్న నానుడి అక్షర సత్యమవుతున్నది...!

అందమైన దస్తూరి(చేతి రాత) కోసం గోదావరిఖనికి చెందిన అక్షర హ్యాండ్ రైటింగ్, పాజిటివ్ మోటివేషన్ అకాడమి కృషిచేస్తున్నది. మేరాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయుడు 2011లో అక్షర హ్యాండ్ రైటింగ్, పాజిటివ్ మోటివేషన్ అకాడమిని నెలకొల్పాడు. అలా మూడేళ్లుగా ఈ ప్రాంతంలో శిక్షణ ఇస్తున్నాడు. జూలై నుంచి ఏప్రిల్ మాసాలలో పాఠశాలల్లో ఆరు రోజులు, 11 రోజులు, 42 రోజులు శిక్షణ ఇస్తూ ఎంతో మంది చేతి రాతలను మార్చి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇక వేసవికాలంలో కూడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి దస్తూరిపై ప్రత్యేక శిక్షణ ఇస్తు న్నారు. ఇప్పటి వరకు సుమారు 6 లక్షలకు పైగా మందికి చేతిరాతపై శిక్షణ ఇచ్చామని మేరాజ్ అహ్మద్ చెబుతున్నారు.

దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించిన అక్షర్...

గోదావరిఖని ప్రాంతంలో దశాబ్దాన్నర క్రితం నెలకొల్పిన అక్షర్ యజ్ఞం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా కొనసాగుతున్నది.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తూ ఎంతో మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారుల దస్తూరి మార్చేసింది. తెలంగాణతో పాటు ఈ దస్తూరి యజ్ఞం దక్షిణాది రాష్ట్రాలకు విస్తరిస్తున్నది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎంతో మంది విద్యార్థుల దస్తూరి మార్చే లక్ష్యంగా ముందుకు వెళతున్నది అక్షర్ ఫౌండేషన్ ఆ దిశగా పని చేస్తున్నది.

విద్యార్థులకే కాదు.. ఉపాధ్యాయులకు మారిన దస్తూరి...

నల్లబంగారు నేలలో పురుడు పోసుకున్న ఈ అక్షర్ ఫౌండేషన్ వందల మందితో మొదలైన ఈ అక్షర యజ్ఞం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మేరాజ్ అహ్మద్ స్థానిక విద్యాసంస్థల సహకారం తీసుకుంటూ ఏడాదికేడాది విద్యార్థుల దస్తూరిలో మార్పులు తీసుకువచ్చి ఎంతో మందికి దస్తూరి కాంపిటీషన్లలో ప్రతిభ చూపేలా కృషి చేశారు. అలా వందల విద్యార్థులతో మొదలై నేడు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలతో సుమారు 5లక్షల మంది విద్యార్థులు, లక్ష మంది ఉపాధ్యాయులతో పాటు ఆన్‌లైన్‌లో సుమారు 10వేల మంది డిగ్రీ, పీజీ, విద్యార్థులతో పాటు ఐఏఎస్ కోచింగ్ అభ్యర్థులు శిక్షణ పొందారు. అలాగే అక్షర్ ఫౌండేషన్ యేటా 20వేల మంది విద్యార్థులు రాష్ట్ర చేతి రాత పోటీల్లో ప్రతిభ చూపారు. 2వేల మంది ఉపాధ్యాయులు రాష్ట్ర హ్యాండ్ రైటింగ్ కాంపిటీషన్‌లో పాల్గొని ప్రతిభ కనపర్చారు.



చేతిరాత కాంపిటీషన్స్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

హ్యాండ్ రైటింగ్‌కు పీరియడ్ కేటాయించాలి: మేరాజ్, అక్షర్ నిర్వాహకుడు



ఉపాధ్యాయుడిగా రెండు దశాబ్దాలుగా పనిచేశా. ఎంతోమంది విద్యార్థుల చేతిరాత బాగా లేకపోవడం దాని ప్రభావం మార్కులపై పడుతుంది. అందుకే నేను ప్రత్యేకంగా శిక్షణ పొంది అక్షర్ సంస్థను నెలకొల్పి చేతిరాత మార్పు కోసం శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. అలా మొదలైన ఈ అక్షర్ ప్రస్థానం 15 ఏళ్లకు చేరింది. అలాగే దక్షిణాది రాష్ట్రాలకు విస్తరిస్తున్నది.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

రాజన్న దర్శనానికి 5 గంటల సమయం



భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేస్తారనే ప్రచారం జోరుగా సాగడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. క్యూలైన్‌లో భక్తులు సుమారుగా 5 గంటలు నిరీక్షించి రాజన్న కోడె మొక్కు చెల్లించుకుని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో రాజన్న ఆలయ ఈవో క్షేత్రస్థాయిలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు ఉద్యోగులను అప్రమత్తం చేస్తూ ఆలయంలోనే సాయంత్రం వరకు ఉన్నారు.

భక్తులతో సందడిగా మారిన భీమన్న ఆలయం

వేములవాడ భీమేశ్వర ఆలయంలో పనులు పూర్తి కావడంతో భక్తులతో సందడిగా కనిపించింది. రాజన్న ఆలయంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో భక్తులు భీమన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

ఇక రాజన్న దర్శనం ఎల్ఈడీ స్క్రీన్లలోనే

రాజన్న ఆలయ పరిసరాల్లోనే స్క్రీన్‌ల ద్వారా దర్శనం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనం ఇక నుంచి ఎల్ఈడీ స్ర్కీన్‌లలోనే చేసుకునేలా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నుంచి ఒక ప్రకటన సోమవారం రాత్రి విడుదలైంది. రాజన్న ఆలయ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అర్చకులు, వేదపండితుల విలువైన సూచనలు, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ఎల్ఈడీ స్ర్కీన్‌లు, తాత్కాలిక ఏర్పాట్ల ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2026వ సంవత్సరంలో సమ్మక్క, సారలమ్మ జాతరకు ముందు, జాతర తరువాత రాజన్న దర్శనం కల్పించేలా భక్తుల సౌలభ్యం కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఎండోమెంట్ దృష్టికి తీసుకువెళ్లిన బండి సజయ్

రాజన్న ఆలయ పరిసరాల్లోనే ఎల్ఈడీ స్ర్కీన్‌లు, తాత్కాలిక ఏర్పాట్లతో స్వామి వారి దర్శనం చేసుకునేలా రాష్ట్ర దేవాదాయశాఖ దృష్టికి తీసుకువెళ్లామని కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల మనోభావాలని పరిగణలోకి తీసుకోవాలని, సాధు సంతుల సూచనలు మేడారం జాతర దృష్ట్యా పరిగణలోకి తీసుకోవాలని సూచించడంతో వివాదాలకు తావివ్వకుండా ఏకాభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

అభివృద్ధి చేస్తూనే భక్తులకు దర్శనాలు కల్పించాలి

ఈవోకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు

రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులను కొనసాగిస్తూనే భక్తులకు దర్శనం కల్పించాలని ఈవో రమాదేవికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి పేరుతో భక్తులకు దర్శనాలు దూరం చేయద్దని అన్నారు. బీజేపీ ఆలయ అభివృద్ధికి వ్యతిరేకం కాదన్నారు. భక్తుల మనోభావాలు పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. రాజన్న ఆలయంలోనే దర్శనాలు కల్పిస్తే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందనే భావన ఉందని తెలిపారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్, శ్రీధర్, నవీన్ యాదవ్, సంతోష్‌బాబు, శేఖర్ ఉన్నారు.



ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

● రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపికకు సింగరేణి సహకారం ● ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించాలని రామగుండం ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్ అన్నారు. సోమవారం సింగరేణి ఆర్‌సీ ఓఏ క్లబ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా టోర్నమెంట్ ఎంపిక పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కరాటే క్రీడతో దేహదారుఢ్యంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల క్రీడానైపుణ్యాన్ని పెంపొందించేందుకు యేటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పేరుతో టోర్నమెంట్లు, సెలక్షన్స్ నిర్వహిస్తుందన్నారు. ఎస్‌జీఎఫ్‌కు సంబంధించిన రాష్ట్రస్థాయి పోటీలకు, ఎంపిక నిర్వహణకు సింగరేణి సంస్థ నుంచి సహకారాన్ని అందిస్తామని జీఎం లలిత్ కుమార్ చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా టోర్న మెంట్‌లో పాల్గొని ప్రతిభ కనపర్చిన పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కు చెందిన అండర్ 14, అండర్ 17 విభాగాల్లో 44 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



జీఎం లలిత్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

అనంతరం జీఎం లలిత్ కుమార్‌ను పెద్దపల్లి జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధులు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొమురోజు శ్రీనివాస్, శోభ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి తగరపు శంకర్, జిల్లా కరాటే అసోసియేషన్ బాధ్యులు వడ్డేపల్లి సురేష్, కరాటే శ్రీనివాస్ రాజకుమార్, పసునూటి శంకర్, కొండ నాగరాజు, నవీన షైనీ, చందు, కూసం శ్రీనివాస్, సురభి వేణుగోపాల్, మన్నన్, లింగస్వామి, పవన్, శ్రీనివాస్, రమేష్, విజయ్‌కుమార్, జావిద్ పాల్గొన్నారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.1.08కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

మల్యాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం హుండీల ద్వారా రూ. 1,08,72,591 ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్ రావు తెలిపారు. 81 రోజులకు ఆలయంలోని 12 హుండీలను సోమవారం లెక్కించగా నగదుతో పాటు 55 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో లభించిన మిశ్రమ బంగారం, వెండిని సీల్ చేసి హుండీలలోనే వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఏసీ సుప్రియ, జగిత్యాల డివిజన్ పరిశీలకులు రాజమొగిలి, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, రఘు, పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్, దేశిని సునీల్, గుండి హరిహరనాథ్, అధికారులు, ఏఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు మోడల్ స్కూల్ విద్యార్థి



అనిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

భగత్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లి మండలం ఎలగందల్ మోడల్‌స్కూల్ విద్యార్థి ఎస్.అనిల్ ఎంపికయ్యాడు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటాడు. అనిల్‌ను ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్, పీడీ హరీష్ అభినందించారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రాలో సత్తా చాటిన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి 13: సెపక్ తక్రా 11వ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. టీం విభాగంలో నాలుగు పతకాలు సాధించారు. ఈ నెల 10 నుంచి 12వరకు ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్‌షిప్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో కరీంనగర్ క్రీడాకారిణులు రజత పతకాన్ని కైవసం చేసుకోగా సబ్ జూనియర్ బాలుర విభాగంలో, జూనియర్స్ బాలబాలికల విభాగంలో కాంస్య పతకాలు సొంతం చేసుకున్నట్లు కరీంనగర్ జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్ను విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. పతకాలు సాధించిన జిల్లా జట్లకు కోచ్, మేనేజర్లుగా జి.కుమార్, శ్రీనివాస్, అజయ్, సుమన్, శ్రీకాంత్ వ్యవహరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు కన్న కృష్ణ, జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు ఎన్.మహిపాల్, జి.జనార్ధన్‌రెడ్డి, టి.రమేష్‌రెడ్డి, ఎన్.సిద్ధారెడ్డి, ఎండీ కరీం అభినందించారు.

జాతీయ పోటీలకు ఎంపికైన శ్రీవర్ష

కరీంనగర్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని ఎన్.శ్రీవర్ష సెపక్ తక్రా జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కరుణ తెలిపారు. ఈ నెల10వ తేదీ నుంచి 12వ వరకు గోలేటి టౌన్ షిప్, ఆసిఫాబాద్ జిల్లాలో జూనియర్స్ రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా చాంపియన్ షిప్‌లో సత్తాచాటినట్లు పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 1 వరకు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.



రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

శివారు కాలనీలు సమస్యలకు నిలయాలు



వరలక్ష్మీకాలనీలో సీసీ రోడ్డు లేక అధ్వానంగా మారిన రహదారి

● డ్రైనేజీ, సీసీ రోడ్లు లేక ప్రజల ఇబ్బందులు

● దోమలతో విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

● వేములవాడ మున్సిపల్ తీరుపై అసహనం

వేములవాడ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని శివారు కాలనీలపై మున్సిపల్ అధికారులకు పట్టింపులేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని కోనాయపల్లి రోడ్డు, మల్లారం రోడ్డు ప్రాంతాల్లో 15ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకున్నా అభివృద్ధి పనులు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి కనీసం డ్రైనేజీలు, సీసీ రోడ్డు కూడా నిర్మించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అభివృద్ధి జరుగుతుందని ఆశించామంటున్నారు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం పడినా రోడ్లు చిద్రమైపోయి నడవలేని స్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని 28 వార్డులకు కౌన్సిలర్‌లు ఉన్న సమయంలో సమస్యలు ప్రజాప్రతినిధుల దృష్టికితీసుకువెళ్లామని ప్రస్తుతం తమ సమస్యను చెప్పుకోవడానికి కూడా ఎవరూ లేరని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు తమ కాలనీకి వార్డు ఆఫీసర్ ఎవరూ రాలేదని, ఇప్పటికైనా తమ సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కాలనీ మహిళలు కోరుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి జాడలేదు

వేములవాడ పట్టణం నుంచి కోనాయపల్లి రోడ్డుకు వెళ్లే మార్గంలోని వరలక్ష్మి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 యేళ్ల క్రితం ఇంటి నిర్మాణాలు జరిగినా తమ కాలనీలో ఇప్పటికీ అభివృద్ధి జరగలేదని చెబుతున్నారు. ఇంటి పన్ను కోసం మున్సిపల్ అధికారులు వచ్చి వసూలు చేసుకుని వెళతారని, సీసీ రోడ్డు, డ్రైనేజీ గురించి అడుగుతే తమ పరిధి కాదని చెబుతున్నారని కాలనీకి చెందిన మహిళలు వాపోతున్నారు. మల్లారం రోడ్డు నుంచి భీమేశ్వర గార్డెన్ వెళ్లే ద్వారకనగర్ చర్చి వెనుక రోడ్డు అధ్వానంగా మారిందని, వర్షాలకు రోడ్డు కోతకు గురి కావడంతో కనీసం అధికారులు కన్నెత్తి కూడా చూడ లేదని విమర్శలున్నాయి. మల్లారం రోడ్డులోని కట్టుకాలువ పక్కన గల కాలనీలో సైతం సీసీ రోడ్డు, డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డ్రైనేజీ లేక రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఇంటికి వెళ్లాలంటే నరకయాతనే

రంజిత్‌కుమార్, వరలక్ష్మికాలనీ, వేములవాడ



మేము ఇళ్లు నిర్మాణం చేసుకుని సుమారు ఐయేళ్లు అవుతోంది. ఇప్పటి వరకు కాలనీలో ఎలాంటి అభివృద్ధి పనులు లేవు. వర్షకాలం వస్తే రోడ్డు నుంచి ఇంటికి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నాం. నడుచుకుంటూ వెళ్లేందుకు కూడా వీలులేకుండా బురదమయంగా మారుతోంది. అప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాం. శివారు కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మాణం చేపడుతాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే అభివృద్ధి పనులు చేపడుతాం. వార్డుకు 10 లక్షల సీసీ రోడ్డు, డ్రైనేజీకి నివేదిక పంపించాం.

అనారోగ్యం బారిన పడుతున్నాం

సాయి, వరలక్ష్మికాలనీ , వేములవాడ



ఎన్నో ఏళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్నాం. కాలనీలో కొనాయపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి వరలక్ష్మికాలనీకి వచ్చే రోడుకు వందల ఇళ్లు ఉన్నాయి. అయినప్పటికీ సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించకపోవడం ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రేచపల్లి విద్యార్థులు

సారంగాపూర్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండంలోని రేచపల్లి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు రాము ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ అండర్ 16, 17, 18 విభాగంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బన్నీ, విగ్నేష్‌లు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు సంజీవ్, లక్ష్మణ్ అభినందించి శుభాకాం క్షలు తెలిపారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో క్రీడాపోటీలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్‌లో ఈ నెల 10నుంచి 12వ తేదీ వరకు క్రీడాపోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో పట్టణంలోని స్థానిక శ్రీ వాగ్దేవి పాఠశాలకు చెందిన విద్యార్థి బొల్లె రోషన్ అండర్ 14 విభాగంలో కాంస్య పథకం సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలో జరిగిన అభినందన సభలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ చక్రధర్‌రావు, జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ గాదె సంతోష్, ప్రెసిడెంట్ గంగారావు, ప్రిన్సిపాల్ సింగం సుమిత్రారాణి, కోచ్ దావనపల్లి రాహుల్ కుమార్ లు విద్యార్థి రోషన్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీల్లో నిజామాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ నాగమణి విద్యార్థి రోషన్‌కు కాంస్య పథకం అందించి అభినందించారు.

కబడ్డీలో ప్రతిభ

జగిత్యాలరూరల్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ ఉన్నత పాఠశాలకు చెందిన రిషిక, సంజన కబడ్డీ-ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటలక్ష్మీ తెలిపారు. విద్యార్థులను ఏపీసీ చైర్మన్ నీరటి సుకన్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన మిషన్ భగీరథ ఈఈ

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మిషన్ భ గీరథ ఈఈగా బాధ్యతలు చేపట్టిన జానకి సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె వెంట డిఈ జలందర్ రెడ్డి, ఏఈలు రాజశేఖర్, దీపక్‌లు ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాయికల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల కేంద్రానికి చెందిన శ్రీ గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పోత రాజు అద్విత, మండ నరేందర్, సార్ల నిశ్వాంత్, మధుప్రియలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ మహేష్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎం రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు సత్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

● పూడూర్‌లో రైల్వే గేట్‌తో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


పూడూర్‌లోని రైల్వే గేట్

కొడిమ్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్ రైల్వే గేట్ పై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. పూడూర్ గ్రామం కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉంది. కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, జగిత్యాల జిల్లాలోని మేడిపెల్లి, కథలాపూర్, కోరుట్లకు చెందిన వారు కూడా సమయానుకూలంగా కరీంనగర్‌కు వెళ్లాలంటే మండలకేంద్రం నుంచి అప్పారావుపేట, పూడూర్ గ్రామాల మధ్య ఉన్న పూడూర్ రైల్వేగేట్‌పై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. జగిత్యాల నుండి వేములవాడకు ఆర్టీసీబస్సులు, ప్రైవేట్ వాహనాలురాక పోకలు సాగిస్తాయి. పూడూర్ గ్రామ పంచాయతీ గత పాలక వర్గం దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయటానికి తీర్మానం చేసి నట్లు గ్రామ మాజీ సర్పంచ్ పెద్ది కవితరవికుమార్ తెలిపారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లయితే మండలంతో పాటు ఇతర మండలాల ప్రజలకు కూడా సౌకర్యంగా ఉంటుంది. పూడూర్ రైల్వేగేట్‌పై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అప్పారావుపేట, పూడూర్‌గ్రామాల మాజీ సర్పంచులు గరిగంటి మల్లే శంముదిరాజ్, పెద్ది కవితరవికుమార్ లు సంబంధిత అధికారులను కోరారు.

ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి



ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ లేకపోవటంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి కరీంనగర్‌కు, పూడూర్ గ్రామానికి రావడానికి విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరంగా వైద్యం కోసం పట్టణాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. అధికారులు, పాలకులు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి చర్యలు తీసుకోవాలి.

-మల్లేశం, అప్పారావుపేట మాజీ సర్పంచ్

ఫ్లై ఓవర్ నిర్మించాలి..



పూడూర్-అప్పారావుపేట గ్రామాల మధ్య ఉన్న రైలు మార్గంపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి. మూడు సంవత్సరాల క్రితం ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానాన్ని సంబందిత రైల్వే అధికారులు అందించాం. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సర్వే కూడా చేశారు.

-కవిత, పూడూర్ మాజీ సర్పంచ్

'బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం'

కోరుట్ల రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని మోహన్‌రావుపేట, జోగినిపల్లి గ్రామంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ జాతీయ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పలుపు మేరకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చెపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించి సంతాకాలను సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎన్నికల సంఘంతో కుమ్మక్కై ఓటు చోరీకి పాల్పడి గత సార్వార్తిక ఎన్నికలో బీజేపీ గెలిచి అధికారంలోని వచ్చిందని ఇందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలో సంతాకాల సేకరణ కార్యక్రమంను చెపట్టి నిరసన తెలుతున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, పెరమాండ్ల సత్యనారాయణ, ఏలేటి మహిపాల్ రెడ్డి, చిక్యాల కిషన్ రావు, సరికెళ్ల నరేష్, పూదరి నర్సయ్య, జాగర్ల మహేష్, జాగర్త రాజయ్య, సంద మహేష్, శనిగారపు రాజయ్య, వినోద్, రాజలింగం, మలేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** ఓట్ల దొంగతనాన్ని ఆపాలని భారత ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం మల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పలువురు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు, మల్లాపూర్ మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి మాట్లాడుతూ క్రమ బద్ధమైన ఓటర్ల అణిచివేతకు పాల్పడిన అధికారులను, ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘమును కోరినారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఓటర్లు, పాల్గొన్నారు.

కరాటే పోటీలకు ఎంపిక

కోరుట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో స్కూల్ గెమ్స్ ఫెడరేషన్ అద్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు గ్రీన్ వుడు పాఠశాల కరస్పాడెంట్ అబ్దుల్ మోయిస్, కేరళా ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాడెంట్ ఎంఏ బారీ తెలిపారు. పాఠశాలకు చెందిన ఆఫీరా ఖానం, శైమా, మోహ్రిస్‌లు రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు వారు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికయిన విద్యార్థులు కరస్పాడెంట్ల్ అబ్దుల్ మోయిస్, ఎంఏ బారీ, ప్రిన్సిపల్ సెలీనా బారీలు అభినందించారు.

'రాజన్న ఆలయ అభివృద్ధిని జీర్ణించుకోలేక బీజేపీ విమర్శలు'


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆలయాన్ని ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ రు. 150 కోట్లతో అభివృద్ధి చేస్తుంటే జీర్ణించుకోలేక బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశం కోసం, ధర్మం కోసం, భక్తుల మనోభావాల కోసమని చెప్పుకుం టున్న బీజేపీ నాయకులు ఎప్పుడైనా వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిని పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. ప్రధాన ఆలయంలో పూజలు యధా విధిగా కొనసాగుతాయని పనులు కొనసాగుతున్న నేపథ్యంలో భీమన్న ఆలయంలో ఆలయ అధికారులు దర్శనంకు ఏర్పాట్లు చేశారన్నారు. ఆలయ అభివృద్ధిని అడ్డుకోవాలని బీజేపీ రాజకీయ కోణంలో చూడడం అవివేకమన్నారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు తొట్ల అంజయ్య, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మండల అధ్య క్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్య క్షుడు చెదలు సత్యనారాయణ, మండల బీసీ విభాగం అధ్యక్షుడు అల్లకొండ లింగంగౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు కారపు గంగాధర్, ఎండీ హఫీజ్, వాకిటి రాజరెడ్డి, పం బాల శంకర్, కట్ట శంకర్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

●**భీమారం:** భీమారం మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా భక్తులకు భీమేశ్వర స్వామి ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని, ఆలయం బంద్ అనేది అవాస్తవ మని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కూరి నరేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మిట్టపల్లి రాజరెడ్డి, జిల్లా నాయకులు ఉరుమట్ల లక్ష్మణ్, నీరటి మల్లేశం, మండల ఉపాధ్యక్షుడు పుప్పాల కొమురయ్య, ఉత్కం శంకర్ గౌడ్, పల్లి భీమయ్య, సురకంటి రాజరెడ్డి, ఎండీ సయ్యద్, ఎనుగంటి హరీష్, బూరం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

అప్‌లోడ్ చేయాలి. ఫొటోలు పని ప్రదేశంలోనే తీయాలి. కూలీ వివరాలు యాప్‌లో నమోదు కాకపోతే ఉపాధి పనికి వెళ్లినా హాజరు పడదు. దీంతో కూలి డబ్బులు ఖాతాల్లో జమ కావు. వేరే ప్రాంతంలో ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే జీపీఎస్ సిస్టం ద్వారా అది తప్పుడు హాజరని నిర్ధారిస్తుంది. ఈ పద్ధతి ద్వారా ఉపాధిహామీ పథకంలో అవకతవకలను నియంత్రించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

పకడ్బందీగా ఈకేవైసీ నమోదు

-రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



జిల్లాలో ఈకేవైసీ నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాం. ప్రస్తుతం అన్ని మండలాల్లోనూ ముమ్మరంగా కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సమస్య వల్ల నెమ్మదిగా జరుగుతోంది. నెట్ సౌకర్యం లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా.

'డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు పూర్తి చేయండి'


కలెక్టర్ సత్యప్రసాద్‌తో సమావేశమైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ శివారులోని అర్బన్ హౌజింగ్ కాలనీలో నిర్మాణాలు పూర్తి చేసుకొని పంపిణీ చేయకుండా మిగిలిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌లను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణంలు కోరారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్య ప్రసాద్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కలిసి వినతిపత్రం అందించి సమస్యను విన్నవించారు. అర్బన్ హౌజింగ్ కాలనీలో 4,520 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మాణం చేయడానికి ప్రతిపాదించడం జరిగిందన్నారు. నిర్మాణం పూర్తి చేసుకొని పంపిణీ చేయకుండా 859 ఇళ్లు మిగిలిపోయి వృథాగా ఉంటున్నాయన్నారు. కాలనీలో అంతర్గత రహదారుల పనులు, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, మురికి కాలువల నిర్మాణాల కొరకు ప్రభుత్వం రూ. 34 కోట్లు కేటాయించిన నిధులతో పనులు పూర్తి చేయబడిందన్నారు. 2023 అక్టోబర్ మాసం వరకు లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించడం జరిగిందన్నారు. అయినప్పటికీ 859 ఇళ్లు మిగిలిపోయి ఉన్నాయని వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు సంబంధిత ఇళ్లను కేటాయించాలని కోరారు. 2008 సంవత్సరంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై అరకొరగా పనులు చేసి అసంపూర్తిగా ఉన్న లబ్ధిదారులకు, బేస్‌మెంట్ లెవల్ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు, ఇళ్ల నిర్మాణం పూర్తయి శిథిలావస్థకు చేరి నివాసానికి యోగ్యంగా ఉండలేని లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని వినతి చేశారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్‌వి డిగ్రీ కళాశాలల నుంచి 2025 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తిచేసిన 280మంది విద్యార్థులకు సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి విద్యార్థికి గ్రాడ్యుయేషన్ ప్రశంసా పత్రం అందించారు. అనంతరం కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు భారతదేశంలో అన్ని స్థాయిల ఉద్యోగాలకు అర్హత కలిగిన డిగ్రీ పట్టా పొందడం చాలా ఉన్నతమైన విషయమన్నారు. విద్యార్థులు మరింత శ్రద్ధతో ఉన్నత చదువులు చదివి రాబోయే రోజుల్లో గ్రూప్-1, సివిల్ సర్వీసెస్ లాంటి ఉద్యోగాల్లో స్థిరపడి కళాశాలకు, వారి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్‌లు మునీందర్‌రెడ్డి, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలు, కళాశాలలకు ప్రత్యేక నిధి

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి సమీక్షలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అత్యవసరం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని కమాండ్ సెంటర్‌లో వివిధ సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులతో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, వివిధ సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సొసైటీలకు రూ 60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో ఎస్సీ, బీసీ సొసైటీలకు రూ 20 కోట్లు చొప్పున, ఎస్టీ, మైనార్టీ సొసైటీలకు రూ.10 కోట్లు చొప్పున మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. దీని ద్వారా ఏదైనా పాఠశాల, కళాశాలలో అత్యవసరమైన చిన్న చిన్న పనులు చేపట్టేందుకు సంబంధిత ప్రిన్సిపల్ కార్యదర్శికి ప్రతిపాదనలు పంపిస్తే, కార్యదర్శి నేరుగా ప్రిన్సిపల్స్‌కు నిధులు ఇచ్చే వెసులు బాటు కలిగిందని ఆయన వివరించారు. కాగా నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జ్ఞాపికను అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

ధర్మపురి క్షేత్రంలో మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు

ధర్మపురి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్ర సమీపంలో గల శ్రీ అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం సందర్శించారు. ఆలయం వద్ద మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వేదపండితులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బూస ప్రవీణ్‌కుమార్ మంత్రిని ఆశీర్వదించి సత్కరించారు. మంత్రి వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు

డిజిటల్ లిటరసీపై అవగాహన ఉండాలి

కోరుట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లిటరసీపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్ పర్సన్ రాజుకుమార్, నాగరాజులు అన్నారు. సోమవారం పట్టణంలోని బాలిక పాఠశాలలో డిజిటల్ లిటరసి శిక్షణలో భాగంగా ఫిజిక్స్ ఉపాధ్యాయులకు కంప్యూటర్ శిక్షణపై అవగాహన కల్పించారు. కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌తో కలిసి రిసోర్స్ పర్సన్ ఉపాధ్యాయులకు శిక్షణను అందించారు. ప్రతి ఉన్నత పాఠశాలలో డిజిటల్ లిటరసిపై నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు గంగాదర్, జ్యోతిలతో పాటు ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

'ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి'


మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అధిక లాభాల ఆశ చూపి చేసే మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫేక్ యాప్ ద్వారా అధిక లాభాపేక్షను ఎర చూపి గ్రామీణ ప్రజలతో పాటు వివిధ హోదాల్లో ఉన్న వారు సైతం మెటాఫండ్, యబిట్ లలో లైన్ విదానంలో పెట్టుబడులు పెట్టి మోసపోతున్నారని అన్నారు. పెట్టుబడిదారులకు విదేశి టూర్‌లు, లగ్జరీ వసతుల పేరిట అమాయక ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. గతంలో ఫైనాన్స్ కంపనీలు రెగ్యులేటరీ లేదు ప్రస్తుతం క్రిప్టో కరెన్సీ పేరిట నకిలీ యాప్‌లు వెబ్‌సైట్‌లు విస్తరించా యన్నారు. జగిత్యాల జిల్లాలోనే వెయ్యికోట్ల వరకు ప్రజలు మోసపోయినట్లు లెక్కలు చెబుతున్నాయన్నారు. చాలా మంది ఏవిధమైన రశీదులు లేకుండానే పెట్టుబడులు పెడుతున్నారన్నారు. క్షణాల్లో యాప్‌లు తొలగిస్తూ ఆదారాలు లేకుండా చేస్తున్నారన్నారు. అక్రమార్కులపై జగిత్యాల పోలీసులు కేసు నమోదు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. నకిలీ యాప్‌లలో పెట్టుబడి పెట్టమని ప్రోత్సహించిన వారి ఆస్తులు జప్తు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చాలా మంది బాధితులు పెట్టిన సొమ్ము రికవరీ అవుతుందో లేదో అని భయపడి కేసు పెట్టేందుకు ముందుకు రావడం లేదని జీవన్‌రెడ్డి అన్నారు. పోలీసులు కేసులు నమోదు చేయడంతో పాటు రికవరీ చేస్తామనే విశ్వాసం బాధితుల్లో కల్పిస్తేనే బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. పోలీసులు సుమోటోగా కేసులు విచారణ చేపట్టాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ఆర్థిక నేరాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, టిపిసిసి కార్యదర్శి బండ శంకర్, మాజీ ఎంపీపీ ధర రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మన్సూర్, మాజీ కౌన్సిలర్‌లు కండ్లపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, భారీ, నాయకులు వల్లెపు మొగిలి, జంగిలి అనిల్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ అభివృద్ధి పేరుతో రాజన్న దర్శనం దూరం చేస్తారా?'

కథలాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అభివృద్ధి పేరుతో రాజన్న దర్శనం దూరం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని మండల బీజేపీ అధ్యక్షుడు మల్యాల మారుతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో వారణాసిలో కాశీ విశ్వనాధ ఆలయం, అయోధ్య రామ మందిరం, శబరిమల అయ్యప్ప ఆలయం, యాదాద్రి ఆలయం అభివృద్ధి జరిగే క్రమంలో స్వామివారలను దర్శనంకు దూరం చేయలేదన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే బీజేపీ ఊరుకోదని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు కథలాపూర్ మహేశ్, ప్రధాన కార్యదర్శి గడ్డం జీవన్‌రెడ్డి, కాశోజీ ప్రతాప్, కల్లెడ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆయల నిర్మాణానికి విరాళం

సారంగాపూర్, అక్టోబరు, 13 (ఆంధ్రజ్యోతి) : సారంగాపూర్ మండలంలోని బట్టపెల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న భక్త ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తేలు రాజు రూ.5 వేలు విరాళం అంజేశారు. కార్యక్రమంలో ప్రేమనందం, ఎట్టెం శ్రీనివాస్, భాస్కర్ నాయక్, తదితరులు ఉన్నారు.

ప్రజావాణి సమస్యలను సత్వరం పరిష్కరించాలి

● జిల్లా పాలనాధికారి సత్యప్రసాద్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యపసాద్ అన్నారు. సోమ వారం జగిత్యాల జిల్లా కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో 55 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవో, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి

జగిత్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో 1-2-206/1 అనే ఇంటిలో గల ఆర్‌ఆర్‌ఆర్ వైన్స్‌ను వెంటనే తొలగించాలని కాలనీకి చెందిన పలువురు మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మద్యం తాగి మహిళలు నడిచి వెళితే రోడ్డు పక్కనే మూత్రాలు పోస్తు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తున్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బోనస్ చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా సన్నపు వడ్లకు 5 వందల బోనస్ వెంటనే ప్రకటించాలని జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక సభ్యులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

గత యాసంగిలో ధాన్యానికి బోనస్ ఇస్తానని ప్రభుత్వ ప్రకటించి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. బోనస్ ఇవ్వకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

కోరుట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లను అర్పించిన అంబేద్కర్ సంఘ నాయకులు మాట్లాడారు. పెద్దపల్లి కలెక్టర్ డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని అడ్డుకొని కుల విచక్షణ చూపుతున్నాడని వారు ఆరోపించి తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచ మేధావి బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్‌ను ప్రపంచ దేశాలు గౌరవిస్తుంటే పెద్దపల్లి జిల్లా కలెక్టర్ మాత్రం భిన్నంగా వ్యవహరించడం విడ్డూరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు ఉయ్యాల నర్సయ్య, బలిజ రాజిరెడ్డి, మోర్తాడ్ లక్ష్మినారాయణ, బద్ది మురళి, ఇంద్రాల హరీష్, ఉయ్యాల శోభన్, పసుల కృష్ణాప్రసాద్, బన్న రాజేష్, పోట్ల లక్ష్మణ్, గురుమంతుల సత్తయ్య, సామల వేణుగోపాల్, కండ్లె మైకల్, దామ కొండయ్య, ఉయ్యాల శేఖర్, సిరికొండ రాములు, కండ్లె గంగాధర్‌లు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

మల్లాపూర్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)13: మల్లాపూర్ మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల చుట్టు ఉన్న పిచ్చి మొక్కలను సోమవారం అధికారులు తొలగింప చేయించారు. పాఠశాలలోకి మూడు రోజుల క్రితం పాము పిల్లలు సంచరించడంతో విషయం తెలుసుకున్న అధికారులు పరిశీలించారు. పాఠశాల చుట్టూ పరిసరాలలో ఉన్న పిచ్చి మొక్కలను గమనించి వాటిని తొలగింప చేయించి శుభ్రం చేయించారు. పాఠశాలకు ప్రహరీ గోడను ఏర్పాటు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరారు. సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్ర జ్యోతి): సింగరేణి మెడికల్‌కళాశాలకు అనుబంధంగా ఉన్న పారామెడికల్ కోర్సుల ప్రవేశానికి ఈ నెల 28లోపు దర ఖాస్తులు స్వీకరించనున్నట్టు సింగరేణి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్‌సైన్స్ ప్రిన్సిపాల్ హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ పారా మెడికల్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు.